
జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
## మహబూబ్‌నగర్


నాగర్ కర్నూల్, వనపర్తి
జోగులాంబ గద్వాల
నారాయణపేట
గురువారం 25 జూన్ 2026 ◆ పేజీలు : 7


## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో వంద శాతం గ్రౌండింగ్ సాధించాలి

- ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులు వేగవంతం చేయాలని అధికారులకు కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆదేశం



**మహబూబ్‌నగర్, జూన్ 24 ( ప్రజా జ్యోతి బ్యూరో )** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్‌ఆర్‌ఈజీఎస్) కింద చేపడుతున్న పనులను వేగవంతం చేయడంతో పాటు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో వంద శాతం గ్రౌండింగ్ సాధించేలా

మిగతా 2 లో...



## అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు

### ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశ వేడుకలో మంత్రి

### మంత్రి జూపల్లి

**కొల్లాపూర్ జూన్ 24, ప్రజాజ్యోతి** పెద్దకొత్తపల్లి మండలం ప్రతి గ్రామ పంచాయతీలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి రాజకీయాలకు అతీతంగా ఇందిరమ్మ ఇల్లు మంజూరు లేకుండా నిజాయితీగా నిస్వార్థంగా ఉన్న పేదవారికి ఇందిరమ్మ ఇల్లు ఇచ్చినా మాట లెక్క ప్రకారంగా బుధ వారం రోజు గృహ ఓపెనింగ్ పాల్గొన్న పర్యాటక,సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు. పెద్దకొత్త పల్లి మండలం గంట్రావుపల్లి,చెన్నప ్పరావుపల్లి గ్రామాల్లో నిర్వహించిన ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం లబ్ధిదారులకు నూతన వస్త్రాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కొత్త ఇంటిలో కుటుంబ సభ్యులు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఉండాలని మంత్రి దీవించారు. మంత్రి మాట్లాడుతూ. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ తొలి విడతలో రూ.22,500 కోట్ల వ్యయంతో

మిగతా 2 లో...

## ఆరోగ్యకరమైన కుటుంబాలు సమాజ నిర్మాణమే లక్ష్యం

- జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక



**నారాయణ పేట ప్రతినిధి జూన్ 24 (ప్రజాజ్యోతి )** మాతృ మరణాలు ( ఎంఎం ఆర్ ), శిశు మరణాల(ఐ ఎం ఆర్ )ను తగ్గించి ఆరోగ్యకరమైన కుటుంబాలు సమాజ నిర్మాణానికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక సూచించారు. బుధవారం సాయంత్రం నారాయణ పేట మండలంలోని అప్పక్ పల్లి వద్ద ల ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి (జి జి హెచ్ ) లో సంకల్ప పై ఏర్పాటు చేసిన సమావేశానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...గర్భిణీలు, బాలింతలు, నవజాత శిశువులు మరియు చిన్నారుల ఆరోగ్యాన్ని మెరుగుపరచడం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సమగ్ర కార్యక్రమమే సంకల్ప్ అని తెలిపారు. గర్భిణీలకు నాణ్యమైన ప్రసూతి సేవలు అందించడం, అధిక ప్రమాద గర్భిణీలను ( హై రిస్క్ ప్రెగ్నెన్సీస్ ) ముందుగానే గుర్తించి ప్రత్యేక వైద్యం అందించడం, నవజాత శిశువుల ఆరోగ్య సంరక్షణను బలోపేతం చేయడం, ప్రభుత్వ ఆరోగ్య సంస్థలలో ప్రసవాలను ప్రోత్సహించడం సంకల్ప్ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యం అని ఆమె పేర్కొన్నారు. అలాగే గర్భిణీల నమోదు, క్రమం తప్పకుండా ఏ ఎన్ సీ పరీక్షలు నిర్వహించాలన్నారు. రక్తహీనత, రక్తపోటు, మధుమేహం వంటి సమస్యల గుర్తించి అవసరమైన చికిత్సలు చేయాలన్నారు. ప్రసవానికి ముందస్తు

మిగతా 2 లో...

## ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్



**వనపర్తి ప్రతినిధి, జూన్ 24 (ప్రజా జ్యోతి):** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అన్ని మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. బుధ వారం పెద్దమందడి మండల కేంద్రం లోని బీసీ బాలుర సంక్షేమ వసతి గృహాన్ని ఆకస్మికంగా సందర్శించి ఇటీవల చేపట్టిన మరమ్మతు పనులను పరిశీలించారు. హాస్టల్‌లో విద్యార్థుల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించిన కలెక్టర్, వంటశాలను పరిశీలించి వంటగ్యాస్ కనెక్షన్ ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా

మిగతా 2 లో...

## పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

- రోడ్డు భద్రతా నియమాల పాటింపులో పోలీసులు ఆదర్శంగా నిలవాలి : ఎస్పీ జానకి



**మహబూబ్‌నగర్, జూన్ 24 (ప్రజా జ్యోతి బ్యూరో ):** నేరాల నియంత్రణ, పెండింగ్ కేసుల పరిష్కారం, ప్రజలకు మెరుగైన సేవలందించడంపై ప్రత్యేక దృష్టిసారించాలని జిల్లా ఎస్పీ దరావత్ జానకి సూచించారు. వార్షిక తనిఖీలలో భాగంగా బుధవారం మహబూబ్‌నగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌ను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలు, రికార్డుల నిర్వహణ, పెండింగ్ కేసుల పురోగతి, రౌడీ షీట్లు, సస్పెక్ట్ షీట్లు, బైండోవర్ కేసుల వివరాలను పరిశీలించారు. నేర ప్రవృత్తి కలిగిన వ్యక్తులపై నిరంతర నిఘా కొనసాగిస్తూ శాంతిభద్రతల పరిరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదు దారులు, బాధితులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, వారి సమస్యలను ఓపికగా విని చట్టబద్ధంగా త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ప్రజల్లో పోలీస్ శాఖపై విశ్వాసం మరింత పెరిగేలా సేవాభావంతో విధులు

మిగతా 2 లో...

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో వంద శాతం గ్రౌండింగ్ సాధించాలి

(మొదటి పేజీ తరువాయి...)

కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎంపీడీఓలు, ఎంపీఓలు, పంచాయతీ కార్యదర్శులు, ఏపీఓలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ పలు కీలక సూచనలు చేశారు. గ్రామాల్లోని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు వెంటనే గృహ నిర్మాణ పనులు ప్రారంభించేలా ప్రోత్సహించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఇళ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుక లభ్యత, బిల్లుల చెల్లింపులు, ప్రభుత్వ సహాయం వంటి అంశాలపై లబ్ధిదారులకు పూర్తి అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. గ్రామ స్థాయిలో పంచాయతీ కార్యదర్శులు లబ్ధిదారులకు నమ్మకమైన అధికారులుగా వ్యవహరించి, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని సూచించారు. లబ్ధిదారులకు సంబంధించి 90 రోజుల వరకు ఉపాధి హామీ మస్టర్ రోల్స్‌ను ఈ నెలాఖరులోగా అప్డేట్ చేసి, వారికి చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లేనిపక్షంలో నిధులు ల్యాప్స్ అయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. హరితహారం, మొక్కల పెంపకం కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించిన కలెక్టర్, మండలాలు, గ్రామాల వారీగా లక్ష్యాలను నిర్దేశించి ప్రణాళికాబద్ధంగా మొక్కలు నాటాలని డీఆర్డీఓ అధికారులకు సూచించారు. కొత్తగా నిర్మించిన పాఠశాల భవనాలు, ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర సంస్థల పరిసరాల్లో మొక్కలు నాటి లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించిన కలెక్టర్, చాలా గ్రామాల్లో రహదారుల పక్కన చెత్తను వేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇకపై ఎట్టి పరిస్థితుల్లోనూ రోడ్ల పక్కన చెత్త వేయకుండా, గ్రామాల్లో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డుల్లోనే చెత్తను పారవేయాలని సూచించారు. ఇందుకు అవసరమైన నిధులను ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు అందజేస్తోందని తెలిపారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మిస్తున్న గ్రామ సంఘ భవనాలు (వీవో భవనాలు), మండల సమాఖ్య భవనాలు, ధాన్య నిల్వ గోదాముల నిర్మాణాల పురోగతిని కూడా సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, జడ్పీ సీఈఓ మరియు ఇన్‌చార్జి డీపీఓ వెంకట్ రెడ్డి, ఆర్డీఓ నవీన్, డీఆర్ఓ నిర్మలతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో మెరుగైన సౌకర్యాలు కల్పించాలి



(మొదటి పేజీ తరువాయి...)

చూడాలని సూచించారు. హాస్టల్‌కు ప్రహరీ గోడ నిర్మాణం అవసరమని సిబ్బంది తెలియజేయడంతో వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలని ఆదేశించారు. అనంతరం పెద్దమందడి జడ్పీహెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాలను సందర్శించి భవనాలు, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టాలని, ఇతర మౌలిక వసతుల కోసం ప్రతిపాదనలు పంపాలని అధికారులకు సూచించారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐ ఆర్) కార్యక్రమంలో భాగంగా చేపట్టిన అవగాహన ర్యాలీని పరిశీలించిన కలెక్టర్, ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

### ♦ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పరిశీలన

మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను కూడా కలెక్టర్ పరిశీలించారు. షేర్‌వాల్ టెక్నాలజీతో నిర్మిస్తున్న గృహాలను సందర్శించి నిర్మాణ వ్యయం, పనుల పురోగతిపై వివరాలు తెలుసుకున్నారు. తక్కువ వ్యయంతో, వేగంగా గృహ నిర్మాణం చేపట్టేందుకు ఈ సాంకేతికత ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. జిల్లాలో షేర్‌వాల్ టెక్నాలజీని మరింత ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. ఇంటి నిర్మాణం కోసం అప్పులు చేయవద్దని లబ్ధిదారులకు సూచించిన కలెక్టర్, ఆర్థిక ఇబ్బందులు ఉన్నవారిని గుర్తించి మహిళా సంఘాల ద్వారా రుణ సౌకర్యం కల్పించాలని ఎంపీడీవోను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ విటోభా, తహసీల్దార్ మల్లికార్జున, ఎంపీడీవో పరిణత, సర్పంచ్ నాగమ్మ, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి



(మొదటి పేజీ తరువాయి...)

నిర్వర్తించాలని పేర్కొన్నారు. స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు అన్ని రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ నిర్వహణలో లోపాలు తలెత్తకుండా చూడాలని సూచించారు. ట్రాఫిక్ సమస్యలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం పోలీస్ సిబ్బందితో సమావేశమైన ఎస్పీ వారి శాఖాపరమైన అవసరాలు, సమస్యలను తెలుసుకున్నారు. విధుల నిర్వహణలో ఎదురయ్యే ఇబ్బందులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని, అవసరమైతే నేరుగా జిల్లా పోలీస్ కార్యాలయానికి తెలియజేయవచ్చని చెప్పారు. రోడ్డు భద్రతా నియమాల పాటింపుపై ప్రత్యేకంగా దృష్టి సారించిన ఎస్పీ, ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి పోలీస్ సిబ్బంది తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనాల్లో సీట్ బెల్ట్ వినియోగించాలని ఆదేశించారు. విధి నిర్వహణలోనే కాకుండా వ్యక్తిగత ప్రయాణాల్లో కూడా రోడ్డు భద్రతా నిబంధనలను పాటిస్తూ ప్రజలకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బంది వినియోగిస్తున్న హెల్మెట్లను స్వయంగా తనిఖీ చేశారు. స్టేషన్ హౌస్ ఆఫీసర్ తన పరిధిలో జరిగే ప్రతి అంశంపై పూర్తి అవగాహన కలిగి ఉండి, సిబ్బందితో సమన్వయం పెంచుకొని సమర్థవంతమైన పర్యవేక్షణ నిర్వహించాలని ఆదేశించారు. ఈ తనిఖీల్లో డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ గాంధీ నాయక్, ఎస్ఐ విజయ్ కుమార్‌తో పాటు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆరోగ్యకరమైన కుటుంబాలు సమాజ నిర్మాణమే లక్ష్యం





(మొదటి పేజీ తరువాయి...)

ప్రణాళిక, సురక్షిత ప్రసవ సేవలు అందించి ప్రసవానంతర తల్లి శిశువు సంరక్షణ, టీకాలు, పోషకాహారం మరియు ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. తద్వారా తల్లి, శిశువుల ఆరోగ్య సూచికల్లో మెరుగుదల, అధిక ప్రమాద గర్భిణీలకు సకాలంలో చికిత్సతో మాతృ, శిశు మరణాల తగ్గింపు సాధ్యం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జయ చంద్రమోహన్, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ సంపత్ కుమార్ సింగ్, జిల్లా ఆస్పత్రుల సమన్వయ కర్త డాక్టర్ మల్లికార్జున్, జిల్లా ఆస్పత్రి వైద్య నిపుణుల బృందం పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు



(మొదటి పేజీ తరువాయి...)

రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసిందన్నారు. ప్రతి నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇండ్లు కేటాయించినట్లు తెలిపారు. రెండవ విడతలో రాష్ట్ర వ్యాప్తంగా 2.50 లక్షల ఇండ్ల నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందని, నియోజకవర్గానికి 2 వేల ఇండ్ల చొప్పున మంజూరు చేసినట్లు చెప్పారు. కులం, మతం, వర్గం, రాజకీయ అనుబంధం చూడకుండా అర్హులైన ప్రతి పేదవారికి ఇందిరమ్మ ఇల్లు అందజేస్తున్నామని చెప్పారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ప్రభుత్వం వెచ్చిస్తోందన్నారు. ఇండ్ల నిర్మాణం చేపడుతున్న లబ్ధిదారులకు ప్రతి సోమవారం దశల వారీగా బిల్లులు చెల్లిస్తూ నిర్మాణ పనులు వేగవంతం చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. పేదల సొంతింటి కలను సాకారం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా వేలాది కుటుంబాలకు శాశ్వత గృహ భద్రత కల్పిస్తున్నామని మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. కార్యక్రమంలో. ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామ ప్రజలు బాధితులు తదితరులు పాల్గొన్నారు.

## అనాథ చిన్నారుల మధ్య ఘనంగా రోనాల్డ్ రోస్ జన్మదిన వేడుకలు

### ● టచ్ ఎన్జీఓ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు



**మహబూబ్‌నగర్, జూన్ 24 (ప్రజా జ్యోతి బ్యూరో )** మహబూబ్‌నగర్ జిల్లా మాజీ కలెక్టర్, ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ఆర్థిక శాఖ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న డి. రోనాల్డ్ రోస్ జన్మదిన వేడుకలను బుధవారం జిల్లా కేంద్రంలోని అప్పనపల్లిలో టచ్ ఎన్జీఓ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అనాథ పిల్లల ఆశ్రమంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమంలోని చిన్నారులతో కలిసి కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. అనంతరం చిన్నారులకు పండ్లు, స్వీట్లు, భోజనాలు పంపిణీ చేసి వారితో సంతోష క్షణాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా టచ్ ఎన్జీఓ ప్రతినిధి కుసుమ యాదమ్మ మాట్లాడుతూ, సమాజంలోని బలహీన వర్గాల అభ్యున్నతి కోసం రోనాల్డ్ రోస్ అందిస్తున్న ప్రోత్సాహం, మార్గదర్శకత్వం ఎంతో ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. సేవా స్ఫూర్తి, పరిపాలనా నైపుణ్యం, సమాజం పట్ల ఉన్న అంకితభావంతో ఆయన ముందుకు సాగుతున్న తీరు అందరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. అనాథ చిన్నారుల మధ్య ఆయన జన్మదిన వేడుకలను నిర్వహించడం ద్వారా సేవాభావం, మానవత్వం, ప్రేమాభిమానాల గొప్పతనాన్ని మరోసారి చాటి చెప్పినట్లైందని తెలిపారు. సమాజానికి సేవ చేయాలనే సంకల్పంతో పనిచేసే వ్యక్తులకు రోనాల్డ్ రోస్ ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. రోనాల్డ్ రోస్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో మరెన్నో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కుసుమ యాదమ్మ, హేమచంద్రుడు, జీహెచ్ఎం జెడ్పీహెచ్ఎస్ ఎదిరా ప్రతినిధులు, డా. బి. వెంకటయ్య (డీటీఎం), కిరణ్, శివ, రాము, సాత్విక్, ప్రశాంతి, సోమనాథ్, ఆర్ఫన్ హోమ్ నిర్వాహకుడు వినయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మోదీ ప్రభుత్వం విద్యా వ్యవస్థను విధ్వంసం చేస్తుంటే... రేవంత్ రెడ్డి ప్రభుత్వం వికాసం వైపు నడిపిస్తోంది

- కాంగ్రెస్ పార్టీ నారాయణపేట జిల్లా అధ్యక్షులు కె.ప్రశాంత్ రెడ్డి



**నారాయణపేట ప్రతినిధి జూన్ 24 (ప్రజా జ్యోతి)**

దేశంలో ప్రస్తుతం అమలవుతున్న విద్యా వ్యవస్థ విద్యార్థుల ప్రతిభను వెలికితీసే వ్యవస్థగా కాకుండా, వారిని తిరస్కరించే "రిజెక్షన్ సిస్టమ్"గా మారిపోయిందని కాంగ్రెస్ పార్టీ నారాయణపేట జిల్లా అధ్యక్షులు శ్రీ కె. ప్రశాంత్ రెడ్డి అన్నారు.బుధవారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని సివిఅర్ భవన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అయన మాట్లాడుతూ రాహుల్ గాంధీ గారు దేశవ్యాప్తంగా విద్యార్థులు,యువత, తల్లిదండ్రులతో నిర్వహిస్తున్న సంభాషణల ద్వారా విద్యా వ్యవస్థలో సమూల మార్పుల అవసరాన్ని ప్రస్తావిస్తున్నారని తెలిపారు.వంద మందిలో ఒక్కరికి మాత్రమే అవకాశం దక్కి, మిగిలిన 99 మందిని విఫలమైన వారిగా చూడటం సరైన విధానం కాదన్నారు. ప్రతి విద్యార్థికి తన కలలు, ప్రతిభ, ఆసక్తికి అనుగుణంగా అవకాశాలు లభించేలా విద్యా వ్యవస్థను మార్చాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.దేశవ్యాప్తంగా ప్రతి సంవత్సరం నీట్ పరీక్షకు 23 లక్షల మంది, జేఈఈ కి 13 లక్షల మంది, యూపీఎస్సీ కి 25 లక్షల మంది, ఆర్ఆర్బి పరీక్షలకు కోట్లాది మంది యువత హాజరవుతున్నారని తెలిపారు.వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం భరోసా ఇవ్వలేకపోతోందన్నారు.3 వేల మంది ఐఐటి ప్రవేశ పరీక్ష రాస్తే కేవలం 30 మందికి మాత్రమే అవకాశం వస్తోందని, మిగిలిన 2,970 మంది విద్యార్థులు వ్యవస్థ చేత తిరస్కరించబడుతున్నారని అన్నారు.అదే విధంగా వైద్య విద్య చదవాలనే లక్ష్యంతో లక్షలాది మంది విద్యార్థులు నీట్ రాస్తున్నప్పటికీ, కొద్దిమందికే సీట్లు దక్కుతున్నాయని పేర్కొన్నారు.ఇది విద్యార్థుల సామర్థ్యాన్ని కొలిచే వ్యవస్థ కాకుండా అవకాశాలను పరిమితం చేసే వ్యవస్థగా మారిందన్నారు. నీట్ పేపర్ లీక్ ఘటన దేశ విద్యా వ్యవస్థ వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు.లక్షలాది మంది విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురైనప్పటికీ కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించలేదన్నారు. పరీక్షల నిర్వహణలో విఫలమైన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ( ఎన్ టి ఏ)పై చర్యలు తీసుకోవాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.పరీక్షల పేపర్లు లీకై విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురవుతున్నా, కొంతమంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నా కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం దురదృష్టకరమన్నారు.విద్యార్థుల ప్రాణాల కంటే పదవులు గొప్పవి కావని, భవిష్యత్తు తరాల జీవితాలతో ఎవరూ చెలగాటం ఆడకూడదన్నారు.అయితే తెలంగాణలో ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజాపాలన ప్రభుత్వం విద్యా రంగంలో చారిత్రాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిందన్నారు.కులం,మతం,ఆర్థిక అసమానతలకు అతీతంగా ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.ఆధునిక సైన్స్ ల్యాబ్స్, డిజిటల్ క్లాస్‌రూమ్స్, లైబ్రరీలు,క్రీడా వసతులతో ప్రభుత్వ విద్యను కార్పొరేట్ స్థాయికి తీసుకెళ్లే ప్రయత్నం జరుగుతోందన్నారు. పేద మరియు మధ్యతరగతి కుటుంబాల పిల్లలు కూడా అత్యుత్తమ విద్యను పొందేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు.నారాయణపేట వంటి వెనుకబడిన ప్రాంతాలకు కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు. విద్యతో పాటు సాగునీటి రంగంలో కూడా భారీ మార్పులు తీసుకొస్తూ నారాయణపేట–కొడంగల్ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు."బీజేపీ ప్రభుత్వం విద్యార్థులను పరీక్షల యంత్రాలుగా మార్చుతుంటే,కాంగ్రెస్ పార్టీ విద్యార్థుల కలలను సాకారం చేసే విద్యా వ్యవస్థ కోసం పోరాడుతోంది. మోదీ ప్రభుత్వం విధ్వంసం వైపు నడిపిస్తే, రేవంత్ రెడ్డి ప్రభుత్వం వికాసం వైపు నడిపిస్తోంది" అని కె. ప్రశాంత్ రెడ్డి పేర్కొన్నారు.విద్యార్థుల అభిప్రాయాలు, సమస్యలు, సూచనలు తెలుసుకునేందుకు త్వరలో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి వాటిని రాష్ట్ర, జాతీయ నాయకత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. విద్యార్థులు నిరాశకు గురికాకుండా ధైర్యంగా ముందుకు సాగాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.సలీం,జిల్లా అధికార ప్రతినిధులు వకీల్ సంతోష్ కుమార్, జనార్ధన్ రెడ్డి, మండల, పట్టణ అధ్యక్షులు కోట్ల.రవీందర్ రెడ్డి,వెంకటేష్ గౌడ్,మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు మహిమూద్ ఖురేషి,సీనియర్ నాయకులు ఎండి.గౌస్,సుధాకర్,సరాఫ్ నాగరాజ్,అమీరుద్దీన్ అడ్వకేట్,కుర్వ మనోజ్,తదితరులు పాల్గొన్నారు.

# అధికారులను భయపెడుతున్న చట్టాలు

- భారత రాష్ట్ర సమితి పార్టీ నాగర్ కర్నూల్ జిల్లా యువ నాయకులు కారంగి బ్రహ్మయ్య







**కొల్లాపూర్ జూన్ 24 ప్రజా జ్యోతి** కొల్లాపూర్ నియోజక వర్గం మండలాలలో ఉన్న రైతులు భూభారతి చట్టం అమల్లోకి వస్తే భూ సమస్యలు రైతులకు పరిష్కారం అవుతదని నమ్మారు. కానీ భూభారతి చట్టం అమల్లోకి వచ్చిన రైతుల సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదు కొత్త చట్టంతో తమ భూ సమస్యలు త్వరగా పరిష్కారం అవుతావని నమ్మిన భూ యజమానులు ఎంతో ఆశపడ్డారు. కానీ వారి ఆశ లు నిరాశలుగా మిగిలాయి అని రైతుల ప్రక్షాళన ప్రజా పాలన ప్రభుత్వాన్ని నిలదీస్తున్న బిఆర్ఎస్ పార్టీ జిల్లా యువ నాయకులు కారంగి బ్రహ్మయ్య మాట్లాడారు. రైతులకు శాపంగా మారిన భూభారతి రైతులు గవర్నమెంట్ ఆఫీసులో చుట్టూ తిరుగుతూ ఆఫీసులో భూమి మా పేరు మీద ఉన్న ఫలితం శూన్యం రైతుల ఆవేదన ప్రభుత్వానికి వ్యక్తం.భూభారతి పోర్టల్ ద్వారా దరఖాస్తులను పరిష్కరించేటప్పుడు కలెక్టర్లు కేవలం కొత్త చట్టం నిబంధనలే కాకుండా దశాబ్దాల కిందటి పాత చట్టాలను కూడా పరిశీలించాల్సి ఉంది. వాటి మధ్య ఉన్న వైరుధ్యాలు కలెక్టర్లను గందరగోళంలో పడేస్తున్నాయి. సాంకేతిక సమస్యలు న్యాయపరమైన చిక్కులు ఉండడంతో భూ సమస్యలను పరిష్కరించేందుకు కలెక్టర్లే జంకుతున్నారు భూములపై హక్కులు నిర్ణయించేందుకు వెనకడుగు వేస్తున్నారని రైతుల ఆవేదనలు ప్రభుత్వానికి వ్యక్తం, 70 శాతం అధికారులు కలెక్టర్ల చేతిలో ఉన్న ఒకసారి కలెక్టర్ తన బయోమెట్రిక్ వీలిముద్ర వేస్తే ఆర్ రికార్డు శాశ్వతంగా ఫ్రీజ్ అవుతుంది, అలా చేస్తే భవిష్యత్తులో ఆ భూమిపై ఏ చిన్న పొరపాటు బయటపడిన ఐటీ చట్టం రెవెన్యూ చట్టాల ప్రకారం కలెక్టరే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని కలెక్టర్లు నిర్ణయాలు తీసుకోలేకపోతున్నారు. రైతుల బాధలను చూసి వింటున్నా కలెక్టర్లు క్షేత్రస్థాయి నుంచి నివేదికలు తప్పించుకుంటున్నారు అయినా ఏదో ఒక భయంతో ఫైల్ పక్కన పెట్టేస్తున్నారు, ఇలా ఎందుకు జరుగుతుందని రైతులు ప్రభుత్వాన్నికి మొరపెట్టుకున్నారు. భూభారతి–2025 చట్టం ప్రకారం. మార్పులు చేర్పులు చేసే పూర్తి డిజిటల్ అధికారం కలెక్టర్ ఆర్డీవో స్థాయి అధికారుల లాగిన్‌లకు పరిమితం చేశారు కలెక్టర్ బయోమెట్రిక్ వేస్తే ఆ రికార్డుకు ఆయనే అంతిమ జవాబుదారీ. ఇక రెండో చట్టం అగ్రి ల్యాండ్ కన్వర్షన్ యాక్ట్. దీనిప్రకారం వ్యవసాయ భూములను వ్యవసాయేతరంగా మార్చే క్రమంలో పాత రికార్డుల్లోని వివరణలు భూభారతి డిజిటల్ మ్యాపింగ్‌తో సరిపోలడం లేదు. చట్టబద్ధంగా కన్వర్షన్ ఇచ్చే అంశంపై సీసీఎల్ఏ ఇచ్చిన మార్గదర్శకాల్లోనూ స్పష్టత లేదు. ఇక మూడో చట్టం 22ఏ నిషేధిత భూముల జాబితా, ఇనాం రద్దు చట్టం. గత ప్రభుత్వ హయాంలో పొరపాటున 22ఏ జాబితాలో చేరిన పట్టా భూములను తొలగించాలంటే. ఇటు రిజిస్ట్రేషన్ చట్టం, అటు పాత ఇనాం భూముల నిబంధనలను పరిశీలించాలి. ఈ రెండు చట్టాల లింకేజీలపై అవగాహన లేక కలెక్టర్లు ఫైళ్లను పెండింగ్‌లో పెడుతున్నారు. ఇక నాలుగోది ఐటీ యాక్ట్. బయోమెట్రిక్ అథెంటికేషన్ అనేది ఐటీ చట్టం పరిధిలోకి వస్తుంది. డిజిటల్ సంతకం లేదా వేలిముద్ర ద్వారా ప్రభుత్వ భూమిని ప్రైవేటు వ్యక్తుల పేరుతో బదిలీ చేస్తే.అది నేరపూరిత నిర్లక్ష్యం కిందకు వస్తుంది. దీంతో భూ సమస్యల పరిష్కారంలో నిర్ణయాలు తీసుకునేందుకు కలెక్టర్లు జంకుతున్నారనే విమర్శలు ఉన్నాయి. వివాదాస్పద భూములపై నిర్ణయం తీసుకొని, కోర్టుల చుట్టూ తిరగడం కంటే వాటిని ముట్టుకోకపోవడమే మంచిదనే భావనలో ఉన్నారనే ప్రచారం జరుగుతోంది.

# అమరగిరి రోడ్డు పనులు తక్షణమే చేపట్టాలి

- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ ఎఫ్ డి ఫయాజ్



**కొల్లాపూర్ జూన్ 24 ప్రజా జ్యోతి** కొల్లాపూర్ మండలంలోని నల్లమల కొండలు కృష్ణా నది తీరాన వెలసిన అమరగిరి గ్రామానికి రోడ్డు ఎం ఆర్ ఆర్ నిధుల నుండి మూడు కోట్ల రూపాయలతో ఫిబ్రవరి 8 2025 నాడు స్థానిక మంత్రి జూపల్లి కృష్ణారావు ఇతర రాష్ట్ర ప్రజా ప్రతినిధులు అధికారులు కలిసి శంకుస్థాపన చేశారు, మూడు కోట్ల నిధులు వచ్చి 17 నెలలు గడుస్తున్నా శంకుస్థాపన అయిపోయిన తర్వాత కూడా ఇప్పటివరకు పనులు ప్రారంభించడం నిర్లక్ష్యం ఎందుకు. సవిచితల్లి ప్రేమ అమరగిరి గ్రామం పై చూపుతున్నారని సిపిఐ నాగర్కర్నూల్ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్ ప్రజా పాలన ప్రభుత్వం పై మండిపడ్డారు, బుధవారం రోజు సిపిఐ బృందంతో కలిసి కొల్లాపూర్ నుండి అమరగిరి వెళ్లే రోడ్డుని ఆయన సందర్శించారు. రోడ్డు దుస్థితిని నాయకుల మరియు గ్రామ ప్రజలతో కలిసి ఆయన పరిశోధించారు, అనంతరం శంకుస్థాపన శిలా పథకం వద్ద ఆయన మాట్లాడుతూ. మండలంలోని అనేక గ్రామాలకు రోడ్డులు అభివృద్ధి విషయంలో పనులు చక చకా జరిగి పోతుంటే అమరగిరిపై మాత్రం నిర్లక్ష్య నీడలు కమ్ముకున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు, పచ్చటి కొండలు కొన్ని వేల సంవత్సరాలుగా పారుతున్న కృష్ణ జీవనదికి తన ఒడిలో చేర్చుకున్న అమరగిరి అందాలు బయటి ప్రపంచానికి తెలియకుండా ఉండడానికి అసలు కారణం రవాణా సౌకర్యాలు లేకపోవడం అన్నారు ఈ గ్రామానికి రోడ్డు నిర్మిస్తే రాష్ట్రవ్యాప్తంగా వచ్చే అనేక మంది పర్యాటకులు ఈ గ్రామం నీ సందర్శించి ఎంతో ఆనందిస్తారని అలాగే గ్రామంలో కూడా ఎంతో అభివృద్ధి జరుగుతుందని ఆయన తెలిపారు. కేవలం పర్యటన కేంద్రం కోసమే కాక ఆ గ్రామంలో కొన్ని వందల కుటుంబాలు రావడం పోవడం విద్యార్థుల రాకపోకలకు బస్సులు లేక వాహనాలు పోలేక రాలేక ఎవరికైనా పురుగు ఇతర ఏ ఆపద వచ్చిన ఏ రోగం వచ్చిన మహిళలకు కాన్పుల సమయంలో గానీ ఇతర ఏ ఆరోగ్య సమస్యలు వచ్చినా కూడా కొల్లాపూర్ పట్టణం చేరుకోవడానికి సరైన సౌకర్యం లేదు, మూడు కోట్ల రూపాయల పంచాయతీరాజ్ నిధులతో శంకుస్థాపన చేశారు. కానీ ఇప్పటికీ పనులు ప్రారంభించలేదు, కాబట్టి తక్షణమే అమరగిరి రోడ్డు పనులు ప్రారంభించక పోతే సిపిఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రజా పోరాటాల నిర్వహిస్తామని ఫయాజ్ హెచ్చరించారు. కార్యక్రమంలో. సిపిఐ మండల కార్యదర్శి తుమ్మల శివుడు. సిపిఐ సీనియర్ నాయకులు లక్ష్మీనారాయణ. చేపల శేఖర్. ఆనంద్. నందు. గ్రామ మాజీ ఉపసర్పంచ్ మల్లేష్. మద్దిలేటి. నారమ్మ. శివ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# రుచికరమైన భోజనం చేయాలి

- డిఆర్డిఓ వెంకట్ రాములు



**నారాయణపేట ప్రతినిధి జూన్ 24 (ప్రజా జ్యోతి)**బుధవారం రోజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జాజాపూర్ డిఆర్డిఓ వెంకట్ రాములు ఆకస్మికంగా తనిఖీ చేసే మధ్యాహ్న భోజనం మెన్ ప్రకారము చేయాలని కూరగాయలను శుభ్రంగా కడిగి వండాలి మధ్యాహ్న భోజన వంట చేసి వారికి పలు సూచనలను తెలియజేశారు ఉపాధ్యాయుల హాజరు విద్యార్థుల హాజరు ఈరోజు పాఠశాలకు ఎంతమంది విద్యార్థులు వచ్చినారు తెలుసుకోవడం జరిగింది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం గురించి అడిగి తెలుసుకోవడం జరిగింది విద్యార్థులకు వారంకి మూడు గుడ్లు తప్పకుండా పెట్టాలని మరియు మెన్ ప్రకారము చేయాలని తెలియజేశారు ఈ కార్యక్రమంలో డిపిఎం మాసన్న ఏపీఎం నారాయణ మరియు పాఠశాల ప్రధానోపాధ్యాయులు భారతి భాను ప్రకాష్ నిర్మల నర్సింలు శిరీష పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ఎ.ఐ డిజటల్ లర్నింగ్ పై అవగాహన



**మఖ్తల్ నియోజకవర్గ ప్రతినిధి, జూన్ 24 (ప్రజా జ్యోతి):** ప్రభుత్వ డిగ్రీ కళాశాల మఖ్తల్ లో విద్యార్థులకు టీచింగ్ ఇంటర్నల్ షిప్ ప్రోగ్రాం ఆన్ ఏఐ డిజిటల్ లెర్నింగ్ పై కళాశాల విద్యా కమిషనర్ ఆదేశానుసారం ఈనెల 24వ తేదీ నుండి 30వ తేదీ వరకు అవగాహన కార్యక్రమం ప్రతిరోజు ఉదయం 10:00 నుండి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని కళాశాల ప్రిన్సిపాల్ ఈ నారాయణ గౌడ్ తెలిపారు. ఎఐ డిజిటల్ లెర్నింగ్ పై ఇంతకు ముందు ట్రైనింగ్ పొందిన అధ్యాపకులు హరిచంద్ర, దివ్య, బాలరాజ్ లు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు ఈ అవకాశాన్ని ఐదవ సెమిస్టర్ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ప్రవేట్ విద్యాసంస్థల్లో... పేద విద్యార్థులకు ఉచిత సీట్లు ఇవ్వాలి

- డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు వర్ధం సైదులు




**నాగర్ కర్నూల్ జూన్ 24( ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి )** అచ్చంపేట పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలల్లో విద్య హక్కు చట్ట ప్రకారం 25% సీట్లను పేద విద్యార్థులకు ఇవ్వాలని డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు వర్ధన్ సైదులు ఎస్ఎఫ్ఐ తాలుక నాయకులు రమేష్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు అచ్చంపేట నియోజకవర్గం ఆర్డీవో యాదగిరి గారికి డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా వారు డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు సైదులు మాట్లాడుతూ... నాగర్ కర్నూల్ జిల్లాలో ఉన్నటువంటి ప్రైవేటు పాఠశాలలను విద్య హక్కు చట్టం అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని వారు అన్నారు విద్యను వ్యాపారంగా చేస్తూ కోట్లకు పడదలెత్తుతున్నారని వారు విమర్శించారు విద్యా హక్కు చట్ట ప్రకారం 25% పేద విద్యార్థులకు ఉచిత సీట్లు ఇవ్వాల్సి ఉండగా ఏ ఒక్క పాఠశాల కూడా అమలు చేయడం లేదని వారు విమర్శించారు ఇష్టానుసారంగా వేల రూపాయలు ఫీజులు వసూలు చేస్తూ పేద విద్యార్థులను వారి తల్లిదండ్రులను మానసిక వేదనకు గురి చేస్తున్నారని వారు అన్నారు చట్టాన్ని అమలు చేసే విధంగా చూడవలసిన అధికారులు నిమ్మకు నేరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని వారు అన్నారు ఈ విద్యా సంవత్సరం నుంచి అయినా ప్రతి ప్రైవేటు పాఠశాలలో 25% పేద విద్యార్థులకు ఉచిత సీట్లు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు చేపడుతామని వారు హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివైఎఫ్ఐ నాయకులు బిక్షపతి సైదులు రాజు మమత చరణ్ రవి పాల్గొన్నారు.

# కెజీబీవీ, పీహెచ్‌సీలపై కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

- అనుమతి లేకుండా గైర్హాజరైన స్పెషల్ ఆఫీసర్‌కు షోకాజ్ నోటీస్

**మహబూబ్‌నగర్, జూన్ 24 ( ప్రజా జ్యోతి బ్యూరో )** జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా బుధవారం గండీడ్ మండలంలో పర్యటించి మహమ్మదాబాద్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ), గండీడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యా, వైద్య సేవల అమలుపై క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించి అధికారులకు పలు సూచనలు చేశారు. ముందుగా మహమ్మదాబాద్ కేజీబీవీని సందర్శించిన కలెక్టర్ ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. విద్యాశాఖ ఉన్నతాధికారుల అనుమతి లేకుండా స్పెషల్ ఆఫీసర్ కుమారి శివలీల విధులకు గైర్హాజరైనట్లు గుర్తించి షోకాజ్ నోటీస్ జారీ చేయాలని ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖ అధికారి సంబంధిత అధికారికి షోకాజ్ నోటీస్ జారీ చేశారు. పాఠశాల తనిఖీ సందర్భంగా కొందరు ఉపాధ్యాయులు తరగతి గదులకు బదులుగా వరండాలో ఉండటాన్ని గమనించిన కలెక్టర్ వెంటనే తమ తరగతుల్లోకి





వెళ్లి బోధన నిర్వహించాలని సూచించారు. సమయపాలన పాటిస్తూ టైమ్‌టేబుల్ ప్రకారం పాఠాలు బోధించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. 10వ తరగతి, 8వ తరగతి విద్యార్థులతో నేరుగా మాట్లాడిన కలెక్టర్ బోధన నాణ్యత, మౌలిక సదుపాయాలు, అల్పాహారం నాణ్యత, వేసవి సెలవుల అనంతరం హాజరు, ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. హాస్టల్‌లో మరుగుదొడ్ల నిర్వహణ, మెనూ ప్రకారం భోజనం అందుతున్నదా అనే అంశాలపై విద్యార్థుల అభిప్రాయాలను తెలుసుకున్నారు.

**››› స్టోర్‌రూమ్‌ను పరిశీలించిన కలెక్టర్:**

కూరగాయలు, ఇతర సామగ్రిని పరిశుభ్రంగా, క్రమబద్ధంగా నిల్వ ఉంచాలని సిబ్బందికి సూచించారు. అనంతరం నిర్మాణంలో ఉన్న కేజీబీవీ నూతన భవన పనులను తనిఖీ చేసి కాంట్రాక్టర్‌తో మాట్లాడారు. నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించడంతో పాటు మండల విద్యాధికారి నిరంతరం పర్యవేక్షించి నివేదికలు అందించాలని సూచించారు.

**››› పీహెచ్‌సీలో వైద్య సేవలపై ఆరా.!**

అనంతరం గండీడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్, రోజువారీ ఓపీ నమోదు, మందుల లభ్యత, గర్భిణీలకు అందుతున్న వైద్య సేవలపై వైద్యాధికారిని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో ప్రసవం జరిగిన ఓ మహిళతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోవడంతో పాటు అవసరమైన వైద్య సేవలు అందుతున్నాయా అని పరిశీలించారు.ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ నాణ్యమైన వైద్య సేవలు అందించాలని వైద్యాధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి జనార్ధన్, వైద్యాధికారి డా. చందు, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాలకు చెక్

- భద్రతా పనులు వేగవంతం చేయాలి
- అధికారులకు కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆదేశం



**మహబూబ్‌నగర్, జూన్ 24 ( ప్రజా జ్యోతి బ్యూరో )** జిల్లాలో జాతీయ రహదారులు, బైపాస్ రోడ్లపై తరచూ జరుగుతున్న ప్రమాదాలను నివారించేందుకు చేపట్టిన రోడ్డు భద్రతా పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ లో నిర్వహించిన జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశంలో జిల్లా ఎస్పీ దరావత్ జానకితో కలిసి వివిధ శాఖల అధికారులతో రోడ్డు భద్రత చర్యల పురోగతిని సమీక్షించారు. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలు స్థితిపై ఆరా తీసిన కలెక్టర్, గంగాపూర్ సమీపంలోని ఎన్‌హెచ్-167పై డివైడర్ నిర్మాణం, రంబుల్ స్ట్రిప్‌ల ఏర్పాటు, అమిస్తాపూర్ వద్ద శ్మశానవాటిక తరలింపు, కొయిల్‌కొండ జంక్షన్ భద్రతా చర్యలపై వివరాలు తెలుసుకున్నారు. మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రి, ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ప్రతిపాదించిన ఫుట్ ఓవర్ బ్రిడ్జిలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న అనుమతులను వెంటనే సాధించాలని ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. అశోక్ టాకీస్ వద్ద మీడియన్ ఏర్పాటు, బాలానగర్ ఫ్లైఓవర్ పనుల పురోగతి, రాజాపూర్ వై-ఫ్లైఓవర్, ముదిరెడ్డిపల్లి అండర్‌పాస్ నిర్మాణ పనులపై సమీక్ష నిర్వహించారు. ఎన్‌హెచ్-44పై పెద్దాయిపల్లి, రంగారెడ్డిగూడెం, పోలేపల్లి, మాచారం జంక్షన్లలో ప్రమాద నివారణ చర్యలు కొనసాగుతున్నాయని అధికారులు వివరించారు. మూసాపేట్ జంక్షన్ వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో అదనపు హెచ్చరిక బోర్డులు, రేడియం స్టిక్కర్లు, బ్యారికేడ్లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. భూత్పూర్, జడ్చర్ల ఫ్లైఓవర్ జంక్షన్ల వద్ద ట్రాఫిక్ సమస్యలు, పాదచారుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించిన కలెక్టర్, పొన్నాకల్ జంక్షన్ వద్ద ప్రమాదకర మలుపు కారణంగా అదనపు రంబుల్ స్ట్రిప్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. బైపాస్ రోడ్డులోని మీడియన్ క్రాసింగ్‌ల వద్ద సోలార్ లైటింగ్ ఏర్పాట్లను కూడా వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి భద్రతా చర్యలను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ సమావేశంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు, ఆర్అండ్‌బీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సంధ్య, పీఆర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రామానుజుల రెడ్డి, ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు, ట్రాఫిక్ పోలీసు అధికారులు, రోడ్డు భద్రత నిపుణులు తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ డ్యూటీ మీట్‌లో ప్రతిభ చాటిన సిబ్బంది

- సాంకేతిక నైపుణ్యాల పెంపునకు ప్రత్యేక పోటీలు

**మహబూబ్‌నగర్, జూన్ 24 ( ప్రజా జ్యోతి బ్యూరో )** పోలీస్ సిబ్బందిలో విధి నిర్వహణ సామర్థ్యం, సాంకేతిక నైపుణ్యాలు, వృత్తిపరమైన ప్రతిభను మరింత మెరుగుపరిచే లక్ష్యంతో జిల్లా స్థాయిలో పోలీస్ డ్యూటీ మీట్ పోటీలను బుధవారం నిర్వహించారు. జిల్లా ఎస్పీ దరావత్ జానకి ఐపీఎస్ పర్యవేక్షణలో జరిగిన ఈ పోటీల్లో వివిధ విభాగాలకు చెందిన పోలీసు సిబ్బంది తమ ప్రతిభను ప్రదర్శించారు.డ్యూటీ మీట్‌లో సైంటిఫిక్ ఎయిడ్స్ టు ఇన్వెస్టిగేషన్ విభాగంలో శాస్త్రీయ ఆధారాల సేకరణ, సంఘటన స్థల పరిశీలన, సాక్ష్యాధారాల పరిరక్షణ అంశాలపై పోటీలు నిర్వహించారు. యాంటీ సబోటేజ్ చెక్ విభాగంలో అనుమానాస్పద వస్తువులను గుర్తించడం, భద్రతా తనిఖీలు, అత్యవసర పరిస్థితుల్లో స్పందించే సామర్థ్యాలను అంచనా వేశారు.డాగ్ స్క్వాడ్ పోటీల్లో శిక్షణ పొందిన శునక బృందాలు ట్రాకింగ్, నేరస్థుల గుర్తింపు, ఆధారాల అన్వేషణలో తమ నైపుణ్యాలను ప్రదర్శించాయి. కంప్యూటర్ అవేర్‌నెస్ విభాగంలో డిజిటల్ టెక్నాలజీ వినియోగం, డేటా నిర్వహణ, కంప్యూటర్ పరిజ్ఞానంపై సిబ్బంది ప్రతిభను పరీక్షించారు.అలాగే ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ విభాగాల్లో సంఘటన స్థలాలను సాక్ష్యాధారాలతో సమగ్రంగా నమోదు చేసే నైపుణ్యాలను అంచనా వేశారు. ఆధునిక పోలీసింగ్‌లో సాంకేతిక పరిజ్ఞానం వినియోగం ఎంత ముఖ్యమో ఈ పోటీల ద్వారా వెల్లడైంది. ఈ సందర్భంగా ఎస్పీ జానకి మాట్లాడుతూ, సాంకేతిక పరిజ్ఞానం, అప్రమత్తత, సమర్థత కలిగిన పోలీసు బలగాలే ప్రజలకు మెరుగైన సేవలు అందించగలవని పేర్కొన్నారు. డ్యూటీ మీట్‌ల ద్వారా సిబ్బందిలో నైపుణ్యాలు మరింత మెరుగై పోలీసింగ్ నాణ్యత పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎన్.బి. రత్నం, ఏఆర్ అదనపు ఎస్పీ సురేష్ కుమార్, భూత్పూర్ సీఐ రామకృష్ణ, ఆర్ఐలు కృష్ణయ్య, నగేష్, అశోక్ కుమార్‌తో పాటు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.





# గుండె స్పందనలో కలిగే అసాధారణతలను నిర్లక్ష్యం చేయొద్దు

- ఆధునిక కార్డియాక్ ఎలక్ట్రోఫిజియాలజీ సేవలు అందిస్తున్న యశోద హాస్పిటల్స్




**మహబూబ్ నగర్ జూన్ 24 (ప్రజా జ్యోతి బ్యూరో )** గుండె స్పందనలో వచ్చే అసాధారణతలు (హార్ట్ రిథమ్ డిసార్డర్స్ ) నిర్ధారణ, చికిత్స మరియు నివారణలో ప్రత్యేక నైపుణ్యం కలిగిన కార్డియాక్ ఎలక్ట్రోఫిజియాలజీ విభాగం యశోద హాస్పిటల్స్‌లో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సేవలు అందిస్తోంది. ఈ విభాగానికి నాయకత్వం వహిస్తున్న డా. ఎం.ఎస్. చంద్రమౌళి, కన్సల్టెంట్ కార్డియాక్ ఎలక్ట్రోఫిజియాలజిస్ట్ మరియు హార్ట్ ఫెయిల్యూర్ స్పెషలిస్ట్, గుండె స్పందన వ్యాధుల చికిత్సలో విశేష అనుభవం కలిగి ఉన్నారు. క్లిష్టమైన ఎలక్ట్రోఫిజియాలజీ విధానాలు, అబ్లేషన్లు, పేస్‌మేకర్ మరియు డివైస్ థెరపీలలో ప్రత్యేక నైపుణ్యంతో రోగులకు అత్యుత్తమ వైద్య సేవలు అందిస్తున్నారు. ఈ లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించండి – గుండె దడ (పల్పిటేషన్స్) – గుండె వేగంగా కొట్టుకోవడం – గుండె కొట్టుకోవడం తప్పిపోతున్నట్లు అనిపించడం – తల తిరగడం – స్పృహ కోల్పోవడం (సున్కాపే) – తరచూ అలసట, నీరసం – శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది – గుండె వైఫల్యం (హార్ట్ ఫెయిల్యూర్) – కుటుంబంలో అకస్మిక గుండె మరణ చరిత్ర చికిత్స పొందే ప్రధాన వ్యాధులు: – ఎట్రియల్ ఫిబ్రిలేషన్ (అట్రియల్ ఫైబ్రిల్లేషన్) – సుప్రావెంట్రిక్యులర్ టాకీకార్డియా (ఎస్ వి టి) – వెంట్రిక్యులర్ టాకీకార్డియా (విటి) – బ్రాడీకార్డియా – హార్ట్ బ్లాక్స్ – జన్యుపరమైన గుండె స్పందన వ్యాధులు – గుండె వైఫల్యం – అకస్మిక గుండె మరణ ప్రమాదం ఉన్న రోగులు అందుబాటులో ఉన్న ఆధునిక సేవలు: ఎలక్ట్రోఫిజియాలజీ స్టడీ (ఈ పి ఎస్): గుండె విద్యుత్ వ్యవస్థను విశ్లేషించి సమస్య మూలాన్ని గుర్తించే ప్రత్యేక పరీక్ష. క్యాథెటర్ అబ్లేషన్: ఎస్ వి టి డబ్లు పి డబ్లు, ఎట్రియల్ ఫ్లట్టర్, ఎట్రియల్ ఫిబ్రిలేషన్ మరియు వెంట్రిక్యులర్ టాకీకార్డియా వంటి సమస్యలకు ఆధునిక చికిత్స. ఎట్రియల్ ఫిబ్రిలేషన్ అబ్లేషన్: అత్యాధునిక 3–డి మ్యాపింగ్ సిస్టమ్స్ సహాయంతో నిర్వహించే ప్రత్యేక ప్రక్రియ. వెంట్రిక్యులర్ టాకీకార్డియా అబ్లేషన్: ప్రాణాపాయ గుండె స్పందన వ్యాధులకు అధునాతన చికిత్స. పేస్‌మేకర్ ఇంప్లాంటేషన్: సింగిల్ ఛాంబర్, డ్యూయల్ ఛాంబర్ మరియు కండక్షన్ సిస్టమ్ పేసింగ్ పద్ధతులు. లీడ్‌లెస్ పేస్‌మేకర్: వైర్లు లేకుండా అమర్చే అత్యాధునిక పేస్‌మేకర్. ఐ సి డి (ఇంప్లంటబులే కార్డీఓవర్టర్ డిఫైబ్రిల్లేటర్): అకస్మిక గుండె మరణాన్ని నివారించే ప్రాణరక్షక పరికరం. సి ఆర్ టి (కార్డియాక్ రేసించరోనిజేషన్ థెరపీ ): గుండె వైఫల్య రోగులలో గుండె పనితీరును మెరుగుపరిచే ప్రత్యేక చికిత్స. డా. ఎం.ఎస్. చంద్రమౌళి మాట్లాడుతూ "గుండె స్పందనలో వచ్చే అసాధారణతలను చాలా మంది సాధారణ సమస్యగా భావించి నిర్లక్ష్యం చేస్తారు. అయితే తల తిరగడం, స్పృహ కోల్పోవడం, గుండె దడ లేదా శ్వాస ఇబ్బంది వంటి లక్షణాలు తీవ్రమైన రిథమ్ సమస్యలకు సంకేతాలు కావచ్చు. ఆధునిక ఎలక్ట్రోఫిజియాలజీ చికిత్సల ద్వారా చాలా మంది రోగులు పూర్తిస్థాయి ఆరోగ్యాన్ని తిరిగి పొందగలుగుతున్నారు. సరైన సమయంలో నిపుణులను సంప్రదించడం అత్యంత ముఖ్యము" అని తెలిపారు. సంప్రదించవలసిన వారు యశోద హాస్పిటల్ సికింద్రాబాద్ శాఖ మేనేజర్ రోహిత్ కుమార్ రామ్‌టెంకి – బి. సుదర్శన్ రెడ్డి లను సంప్రదించాలని సూచించారు.

# నీటి సరఫరా నిలిపివేత

- ఎన్‌హెచ్-44 పనుల ప్రభావం.. 49 గ్రామాల్లో నీటి సరఫరా అంతరాయం

**మహబూబ్‌నగర్, జూన్ 24 (ప్రజా జ్యోతి బ్యూరో)** జాతీయ రహదారి–44 విస్తరణ పనుల నేపథ్యంలో మిషన్ భగీరథ ప్రధాన పైప్‌లైన్ మార్పిడి చేపట్టనున్నందున మహబూబ్‌నగర్ జిల్లాలోని 49 గ్రామాలకు 48 గంటల పాటు తాగు నీటి సరఫరా నిలిపివేయనున్నట్లు మిషన్ భగీరథ గ్రిడ్ డివిజన్ కార్యనిర్వహక అభియంత డి. శ్రీనివాస్ తెలిపారు.భూత్పూర్ మండలం అన్నాసాగర్ గ్రామ సమీపంలో ఎన్‌హెచ్–44 బ్లాక్‌స్పాట్ రోడ్ వైండింగ్ పనుల కారణంగా మిషన్ భగీరథ పైప్‌లైన్‌ను మార్చాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. ఈ పనులు జూన్ 25 ఉదయం 8 గంటలకు ప్రారంభమై జూన్ 27 ఉదయం 8 గంటల వరకు కొనసాగనున్నాయని పేర్కొన్నారు.మరమ్మత్తు, పైప్‌లైన్ మార్పిడి పనుల కారణంగా అడ్డాకుల మండలంలోని 19 గ్రామాలు, భూత్పూర్ మండలంలోని 11 గ్రామా లు, మూసాపేట మండలంలోని 19 గ్రామాలు కలిపి మొత్తం 49 గ్రామా ల్లో తా గునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు తెలిపారు. పనులు పూర్తయిన వెంటనే నీటి సరఫరాను పునరుద్ధరిస్తామని పేర్కొన్న ఆయన, ప్రజలు ముందస్తుగా తాగునీటిని నిల్వ చేసుకుని అధికారులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# మైనర్ డ్రైవింగ్‌పై పోలీసుల ప్రత్యేక డ్రైవ్

- 15 మంది మైనర్ వాహనదారులకు కౌన్సెలింగ్
- తల్లిదండ్రులకు హెచ్చరిక



**మహబూబ్‌నగర్, జూన్ 24 ( ప్రజా జ్యోతి బ్యూరో )** మైనర్ డ్రైవింగ్‌ను అరికట్టేందుకు మహబూబ్‌నగర్ పట్టణంలో ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ దరావత్ జానకి ఆదేశాల మేరకు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన ఈ తనిఖీల్లో మొత్తం 15 మంది మైనర్ వాహనదారులను గుర్తించారు.ప్రత్యేక డ్రైవ్‌లో పట్టుబడిన మైనర్లను, వారి తల్లిదండ్రులను బుధవారం మహబూబ్‌నగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు.మైనర్లకు వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరమని, అలాంటి చర్యలు ప్రమాదాలకు దారితీసే అవకాశముందని ట్రాఫిక్ పోలీసులు తల్లిదండ్రులకు వివరించారు.మైనర్ డ్రైవింగ్ వల్ల ప్రాణనష్టం, ఆస్తినష్టం సంభవించే ప్రమాదం ఉందని, తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించి పిల్లలకు వాహనాలు ఇవ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్న పోలీసులు, ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మైనర్ డ్రైవింగ్‌ను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రజలు సహకరించాలని కోరారు.

# కేసీఆర్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా చేయడమే లక్ష్యం

- ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతం చేయాలి
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

**వనపర్తి, జూన్ 24 (ప్రజాజ్యోతి):** "ఎస్ఐఆర్" ప్రక్రియను నాయకులు, కార్యకర్తలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని విజయవంతం చేయాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పిలుపునిచ్చారు. జిల్లా పార్టీ అధ్యక్షుడు గట్టు యాదవ్ అధ్యక్షతన బుధవారం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన బూత్ లెవల్ ఏజెంట్ల (బీఎల్ఏ) శిక్షణా కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మూడు నెలల పాటు కొనసాగే ఎస్ఐఆర్ ప్రక్రియలో తొలి నెల అత్యంత కీలకమని, పార్టీ నాయకులు, కార్యకర్తలు, బీఎల్ఏలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఓటర్ల జాబితా సవరణతో పాటు ప్రజా సమస్యలను గుర్తించి పార్టీ దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రజల్లో కేసీఆర్ నాయకత్వంపై విశ్వాసం బలంగా ఉందని, ఆయనను మరోసారి ముఖ్యమంత్రిగా చూడాలనే ఆకాంక్ష స్పష్టంగా కనిపిస్తోందని పేర్కొన్నారు. బూత్ లెవల్ ఏజెంట్లు పార్టీ భవిష్యత్తుకు కీలకమని, ఓటర్ల నమోదు, సవరణ ప్రక్రియలో అప్రమత్తంగా వ్యవహరించాలని నిరంజన్ రెడ్డి సూచించారు. 316 బూత్‌లను పార్టీ నాయకులు పర్యవేక్షిస్తూ ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతం చేయాలని తెలిపారు. ప్రజలకు సంబంధించిన సమాచారం పార్టీకి అందుబాటులో ఉండేలా బీఎల్ఏలు కృషి చేయాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి మెట్టు శ్రీనివాస్ మాట్లాడుతూ, ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని అర్హుల ఓట్లు కాపాడుతూ, అనర్హుల ఓట్ల తొలగింపులో చట్టబద్ధంగా వ్యవహరించాలని సూచించారు. బూత్ లెవల్ ఏజెంట్లు పార్టీ సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ అభివృద్ధికి కేసీఆర్ నాయకత్వం అవసరమని, వనపర్తి అభివృద్ధి కోసం నిరంజన్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో గట్టు యాదవ్, బి. లక్ష్మయ్య, వాకిటి శ్రీధర్, పలుస రమేష్ గౌడ్, జగదీశ్వర్ రెడ్డి, నందిమల్ల అశోక్, కృష్ణా నాయక్, రఘుపతి రెడ్డి, కర్రెస్వా మి, వనం రాములు, దిలీప్ రెడ్డి, కె. మాణిక్యం, బి. బాలరాజు, వేణు యాదవ్, రాళ్ల కృష్ణయ్య, శివరామ్ రెడ్డి, వెంకట్ స్వామి, గంధం పరంజ్యోతి, ఆవుల రమేష్, పెద్దింటి వెంకటేష్, రాజశేఖర్, ఎద్దుల సాయికుమార్, వెంకట్ సాగర్, ప్రేమ్‌నాథ్ రెడ్డి, నాగన్న యాదవ్, మతీన్, సునీల్ వాల్మీకి, చిట్యాల రాము, హేమంత్ ముదిరాజ్, వడ్డే రమేష్, మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.




# బూత్ బలంగా ఉంటేనే కాంగ్రెస్ విజయం: డీసీసీ చీఫ్ శివసేన రెడ్డి

- బీఎల్ఏ-2లు అప్రమత్తంగా వ్యవహరించాలి: పార్లమెంట్ ఇన్‌చార్జ్ సిద్ధేశ్వర్



**వనపర్తి, జూన్ 24 (ప్రజాజ్యోతి ):** ప్రతి పౌరుడికి ఓటు హక్కు ప్రాధాన్యతను తెలియజేస్తూ, బూత్ స్థాయిలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కావాలంటే ఏజెంట్లు సమర్థంగా పనిచేయాలని డీసీసీ అధ్యక్షుడు, రాష్ట్రక్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేన రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డీసీసీ చీఫ్ శివసేన రెడ్డి అధ్యక్షతన బీఎల్ఏ–2 సభ్యులు, ఇన్‌చార్జ్‌లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పార్లమెంట్ ఇన్‌చార్జ్ సిద్ధేశ్వర్ హాజరై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా శివసేన రెడ్డి మాట్లాడుతూ బూత్ పరిధిలోని ప్రతి కుటుంబంతో నిరంతరం సంబంధాలు కొనసాగించాలని సూచించారు. ఓటర్ల వివరాల మార్పులు, సమస్యలపై ప్రత్యేక రికార్డు నిర్వహించాలని తెలిపారు. బోగస్ ఓట్లు, మరణించిన వ్యక్తుల పేర్లు, ఇతర ప్రాంతాలకు మారిన వారి ఓట్లు, డూప్లికేట్ నమోదులపై ప్రత్యేక దృష్టి సారించి అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఓటర్లను భద్రపరిచే బాధ్యతను ప్రతి కార్యకర్త నిర్వర్తించాలని అన్నారు. పార్లమెంట్ ఇన్‌చార్జ్ సిద్ధేశ్వర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఓటరు నమోదు ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. గురువారం నుంచి ప్రారంభమయ్యే ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియలో ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఓటరు నమోదు, మార్పులు, సవరణల ప్రక్రియలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఓటర్ల నమోదు ప్రక్రియకు సంబంధించిన సందేహాలు, సమస్యల పరిష్కారం కోసం వనపర్తి డీసీసీ కార్యాలయంలో కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు టోల్‌ఫ్రీ నంబర్ ద్వారా సమాచారం అందించవచ్చని చెప్పారు. సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు సాయిచరణ్ రెడ్డి, తిరుపతయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రహ్మాచారి, అధికార ప్రతినిధులు కోళ్ల వెంకటేష్, శరవంద, జనార్ధన్ సాగర్, ధనలక్ష్మి , పట్టణ అధ్యక్షుడు కదిరే రాములు, మండల అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అసంపూర్తి రోడ్డుకు ప్రత్యేక నిధులు మంజూరు చేయించండి



**నారాయణపేట ప్రతినిధి జూన్ 24 ప్రజా జ్యోతి** మహబూబ్నగర్ పార్లమెంటు సభ్యురాలు శ్రీమతి డీకే అరుణ గారికి సిపిఎం నాయకులు గుండెగారి దస్తప్ప, గోటూరు మల్లేష్ లు వినతిపత్రం అందజేశారు .బొమ్మనుపాడు నుంచి అమ్మిరెడ్డి పల్లి వరకు, కోటకొండ వింజమూరు గేట్ వరకు అసంపూర్తిగా మిగిలిపోయిన బీటీ రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలని అందుకు కేంద్ర ప్రభుత్వంతో తమరు మాట్లాడి ప్రత్యేక నిధులు మంజూరు చేయించాలని కోరారు. బుధవారం రోజు కోటకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పిఎం శ్రీ పథకాన్ని ప్రారంభించడానికి విచ్చేసిన డీకే అరుణ గారికి కలిసి వినతి పత్రం అందజేశారు. టిఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిధుల ద్వారానే అప్పక్ పల్లి నుంచి కోయిలకొండ వరకు 56 కోట్లతో పనులు బీట్ డబల్ రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి అని నేడు నిధుల కొరతతో అసంపూర్తిగా రోడ్డు నిలిచిపోయిందని ,కావున తమరు కేంద్ర ప్రభుత్వం ద్వారా ప్రత్యేక నిధులు కేటాయించి అసంపూర్తి పనులను పూర్తి చేయాలని విన్నవించారు. అదేవిధంగా అన్ని అర్హతలు కలిగిన కోటకొండ గ్రామాన్ని మండలం కేంద్రంగా ఏర్పాటు చేయాలని ,ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరిక నెరవేర్చాలని అందుకు తమరు రాష్ట్ర ప్రభుత్వానికి సూచిస్తూ ఉత్తరం రాయాలని కోరారు.

# క్రీడలతో ప్రపంచ స్థాయి గుర్తింపు సాధించవచ్చు

- యువత చదువుతో పాటు క్రీడలపై దృష్టి పెట్టాలి
- అంతర్జాతీయ త్రైక్వాండో విజేత వినోద్ కుమార్ రెడ్డికి ఎమ్మెల్యే సత్కారం



**వనపర్తి, జూన్ 24 (ప్రజాజ్యోతి):** ఇటీవల థాయ్‌లాండ్ లోని బ్యాంకాక్‌లో నిర్వహించిన అంతర్జాతీయ త్రైక్వాండో పోటీల్లో రెండు బంగారు పతకాలు, ఒక కాంస్య పతకం సాధించి దేశానికి గర్వకారణంగా నిలిచిన వనపర్తి జిల్లా క్రీడాకారుడు సానే వినోద్ కు మార్ రెడ్డిని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి బుధవారం ఘనంగా సత్కరించా రు. హైదరాబాద్ మాదాపూర్ లోని తన కా ర్యాలయంలో వినోద్ కు మార్ రెడ్డికి శాలువా కప్పి అభినందించిన ఎమ్మెల్యే, ఆయన సాధించిన విజయాలు దేశంతో పాటు వనపర్తి జిల్లా ఖ్యాతిని అంతర్జా తీయ స్థాయిలో చాటాయని కొనియాడారు. వనపర్తి మండలం మాజీ ఎంపీపీ సానే కిచ్చారెడ్డి కుమారుడైన వినోద్ కుమార్ రెడ్డి క్రీడా రంగంలో సాధించిన ఈ విజయాలు యువతకు ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. విద్యార్థులు, యువకులు విద్యతో పాటు క్రీడలపై కూడా దృష్టి సారిస్తే జాతీయ, అంతర్జాతీ య స్థాయిలో గుర్తింపు పొందే అవకాశాలు మెరుగుపడతాయని ఎమ్మెల్యే సూ చించారు. క్రీడలు వ్యక్తిత్వ వికాసానికి, క్రమశిక్షణకు దోహదపడతాయని తెలిపారు. పలువురు ప్రజాప్రతినిధులు, క్రీడాభిమానులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# ఎస్సీ వర్గీకరణ ఫలాలు మాదిగల అభ్యున్నతికి దోహదం చేయాలి

- జూలై 7న ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయండి
- ఎమ్మార్పీఎస్ వనపర్తి జిల్లా అధ్యక్షులు కొమ్ము చెన్నకేశవులు మాదిగ పిలుపు

**చిన్నంబావి, జూన్ 24 (ప్రజాజ్యోతి)** మాదిగ సమాజం ఎన్నో ఏళ్లుగా సాగించిన ఉద్యమాలు, త్యాగాల ఫలితంగా సాధించుకున్న ఎస్సీ వర్గీకరణ ప్రయోజనాలను ప్రతి మాదిగ విద్యార్థి, యువకుడు సద్వినియోగం చేసుకుని విద్య, ఉద్యోగాలు, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎమ్మార్పీఎస్ వనపర్తి జిల్లా అధ్యక్షులు కొమ్ము చెన్నకేశవులు మాదిగ పిలుపునిచ్చారు. పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు చిన్నంబావి మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల జిల్లా కమిటీ సమావేశం ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ చిన్నంబావి మండల అధ్యక్షులు దేవని రమేష్ మాదిగ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షులు కొమ్ము చెన్నకేశవులు మాదిగ ముఖ్య అతిథిగా హాజరై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామ స్థాయి నుంచి ఎమ్మార్పీఎస్ సంస్థను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్సీ వర్గీకరణ ద్వారా లభించిన అవకాశాలపై మాదిగ సమాజంలో విస్తృత అవగాహన కల్పించి, విద్యార్థులు, నిరుద్యోగ యువత వాటిని అందిపుచ్చుకునేలా చైతన్యం తీసుకురావాలని సూచించారు. ఉద్యమ ఫలాలను సామాజిక, విద్యా, ఆర్థిక పురోగతిగా మలచుకోవడంలో కార్యకర్తలు కీలక పాత్ర పోషించాలని పేర్కొన్నారు. అదేవిధంగా, రానున్న జూలై 7న జరిగే ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ప్రతి మాదిగ పల్లెలో ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ప్రతి గ్రామంలో ఎమ్మార్పీఎస్ జెండాలను ఎగురవేయడంతో పాటు, జెండా దిమ్మలు లేని ప్రాంతాల్లో ఈ నెల 25వ తేదీ నుంచి 40 రోజులపాటు ప్రత్యేక కార్యక్రమంగా జెండా దిమ్మల నిర్మాణాన్ని చేపట్టాలని తీర్మానించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎంఎస్ఎఫ్ వనపర్తి జిల్లా అధ్యక్షులు మొలకలపల్లి పరుషరాముడు మాదిగ, చిన్నంబావి మండల సీనియర్ నాయకులు కాన్సిరాం, తగరం కురుమయ్య, కేతపాగ శివ కృష్ణమాదిగ, ఎమ్మార్పీఎస్ నాయకులు విష్ణు మాదిగ, ప్రవీణ్ మాదిగ, అజయ్ మాదిగ, రాంబాబు మాదిగ, తగరం గోపాల్ మాదిగ, ఎమ్మార్పీఎస్ సోషల్ మీడియా నాయకులు వర్మ మాదిగతో పాటు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.



# డ్రగ్స్, గంజాయి నిర్మూలనకు పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి

- అన్ని శాఖల సమన్వయంతోనే మత్తు పదార్థాల నియంత్రణ సాధ్యం : కలెక్టర్ ఖుష్బూ గుప్తా
- నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా నేడు అవగాహన ర్యాలీ



**మహబూబ్‌నగర్, జూన్ 24 ( ప్రజాజ్యోతి బ్యూరో )** జిల్లాలో డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాల నిర్మూలనకు పాఠశాలలు, కళాశాలల్లో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో నార్కోటిక్ కోఆర్డినేషన్ జిల్లా కమిటీ (ఎన్‌సీఓఆర్‌డీ) సమావేశాన్ని జిల్లా ఎస్పీ దరావత్ జానకితో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మత్తు పదార్థాల నియంత్రణ, అక్రమ రవాణా నివారణ, యువతలో అవగాహన పెంపు, విద్యాసంస్థల్లో చేపట్టాల్సిన చర్యలపై సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు. పోలీసు, విద్యా, సంక్షేమ, వైద్య ఆరోగ్య శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ అనుమానాస్పద కార్యకలాపాలపై నిరంతర నిఘా ఉంచాలని సూచించారు. యువత మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడేందుకు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. విద్యార్థుల్లో చైతన్యం పెంపొందించడం ద్వారా మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్టవచ్చని పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ జానకి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న “నషా ముక్త్ భారత్ అభియాన్ – వికసిత్ భారత్ కి పహచాన్” కార్యక్రమంలో భాగంగా జూన్ 17 నుంచి 26 వరకు జిల్లాలో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జూన్ 22 నుంచి పోలీసు శాఖ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా నివారణపై పలు కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు. పోలీసు శాఖ ఒక్కటే కాకుండా అన్ని శాఖల అధికారులు బాధ్యతగా పనిచేస్తేనే మత్తు పదార్థాల దుర్వినియోగం, అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టవచ్చని ఎస్పీ పేర్కొన్నారు. ముఖ్యంగా విద్యాశాఖ అధికారులు విద్యార్థులపై నిరంతర పర్యవేక్షణ ఉంచాలని, అనుమానాస్పద ఘటనలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమావేశంలో ఎక్సైజ్ శాఖ అధికారులు జిల్లాలో చేపట్టిన చర్యల వివరాలను వెల్లడించారు. గత నెలలో రెండు కేసులు నమోదు చేసి 3.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని ము గ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు తెలిపారు. అలాగే 2026 జనవరి నుం చి ఇప్పటి వరకు మొత్తం ఆరు కేసులు నమోదు చేసి 20 మందిని అరెస్టు చేసినట్లు వివరించారు. మెడికల్ షాపుల్లో అలవాటు కలిగించే ఔషధాల విక్రయాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని కలెక్టర్ డ్రగ్ కంట్రోల్ అధికారులను ఆదేశించారు. మెడికల్ షాపులపై తరచూ తనిఖీలు నిర్వహించడంతో పాటు యజమానులు, ఔషధ సరఫరాదారులతో సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామాల్లో మాదక ద్రవ్యాలకు బానిసలవుతున్నట్లు అనుమానాస్పదంగా కనిపించే విద్యార్థులు, యువతను గుర్తించేందుకు ఉపాధ్యాయులకు ప్రత్యేక అవగాహన కల్పించాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. మాదక ద్రవ్యాల అక్రమ సరఫరా, విక్రయాలపై కఠిన నిఘా ఉంచి నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు సూచించారు.

**››› నేడు నషా ముక్త్ భారత్ అవగాహన ర్యాలీ:**

మాదక ద్రవ్యాల నియంత్రణపై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు గురువారం (జూన్ 25) ఉదయం 9.30 గంటలకు జిల్లా స్టేడియం గ్రౌండ్ నుంచి అంబేద్కర్ చౌక్ వరకు భారీ అవగాహన ర్యాలీ నిర్వహించనున్నట్లు జిల్లా సంక్షేమ శాఖ అధికారి తెలిపారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున విద్యార్థులను పాల్గొనించి ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి జరీనా బేగం, జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి, ఎక్సైజ్, వైద్య ఆరోగ్య శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కుటుంబ వివాదాలతో యువ వివాహిత ఆత్మహత్య

- కొండేర్ గ్రామంలో దుర్ఘటన 26 ఏళ్ల నాగవేణి మృతి

**అలంపూర్ డివిజన్ (ప్రజాజ్యోతి) జూన్ 24:** జోగులాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండలం కొండేర్ గ్రామానికి చెందిన నాగవేణి (26) అనే వివాహిత కుటుంబ కలహాల నేపథ్యంలో తన నివాసంలో నిన్న సాయంత్రం 4 గంటల 20 నిమిషాలకు ఉరి వేసుకుని మృతి చెందినట్లు సమాచారం. మృతురాలి తల్లి బోయ నర్సమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఏఎస్ఐ సుధాకర్ తెలిపారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంలో సంక్షేమానికి పెద్దపీట

- ఎమ్మెల్యే డా.కూచుకుళ్ల రాజేష్ రెడ్డి



**నాగర్ కర్నూల్ : జూన్ 24 (ప్రజా జ్యోతి)** కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం సంక్షేమానికి పెద్ద పీట వేస్తుందని ఎమ్మెల్యే డాక్టర్.రాజేష్ రెడ్డి అన్నారు. బుధవారం నాగర్‌కర్నూల్ మండల పరిధిలోని నర్సాయిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ గృహ ప్రవేశ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్.రాజేష్ రెడ్డి పాల్గొన్నారు. గ్రామంలో దేవాలయ నిర్మాణానికి సంబంధించి భూమి కేటాయింపుపై స్థానికులతో కలిసి స్థలాన్ని పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకునేలా అధికారులకు సూచనలు చేసి, అనంతరం గ్రామ ప్రాథమిక పాఠశాలను సందర్శించిన విద్యార్థులతో ఆప్యాయంగా మాట్లాడి ప్రభుత్వం అందజేస్తున్న ఉచిత పాఠశాల యూనిఫామ్‌లు, షూస్ పంపిణీపై విద్యార్థులను అడిగి తెలుసుకుని, విద్యార్థులకు నాణ్యమైన విద్య, అవసరమైన సౌకర్యాలను కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సర్పంచ్ రాము, ఉప సర్పంచ్ రేణుక, వార్డ్ సభ్యులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు, నాయకులు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఉద్యమకారుల ఆశయ సాధనకు ‘విజయ సంకల్ప యాత్ర’

- వడ్డేపల్లిలో పోస్టర్ ఆవిష్కరణ

**వడ్డేపల్లి జూన్ 24(ప్రజా జ్యోతి ):** తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారుల ఆశయాల సాధన కోసం తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో ఈ నెల 26 నుంచి 29 వరకు ఆదిలాబాద్ నుంచి అల్లంపూర్ వరకు 101 కార్లతో నిర్వహించనున్న ‘విజయ సంకల్ప యాత్ర’ పోస్టర్‌ను వడ్డేపల్లి మండల కేంద్రంలో బుధవారం ఘనంగా ఆవిష్కరించారు. రాష్ట్ర అధ్యక్షుడు ఓరుగంటి ఆనంద్ పిలుపు మేరకు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి పాలమూరు జిల్లా అధ్యక్షుడు గార్లపాడు భూషణం, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గుమ్మ గోవర్ధన్, వడ్డేపల్లి మండల అధ్యక్షుడు రేపల్లె సూరి బాబు ముఖ్య అతిథులుగా హాజరై యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం గార్లపాడు భూషణం మాట్లాడుతూ, అమరుల త్యాగాలతో సాధించుకున్న తెలంగాణలో ఉద్యమకారుల ఆకాంక్షలు నెరవేరాలని అన్నారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వం స్పందించేలా చేయడం, ఉద్యమ స్ఫూర్తిని ప్రతి గ్రామానికి తీసుకెళ్లడమే విజయ సంకల్ప యాత్ర ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. గుమ్మ గోవర్ధన్ మాట్లాడుతూ, రాష్ట్ర అధ్యక్షుడు ఓరుగంటి ఆనంద్ నాయకత్వంలో ఉద్యమకారులందరినీ ఏకతాటిపైకి తీసుకువచ్చి వారి హక్కుల సాధన కోసం పోరాడతామని తెలిపారు. యాత్ర ద్వారా ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉద్యమకారులు దగ్గుపాటి బాబు, మాల దేవేంద్ర, గ్యాంగ్ రవి, కాశపోగు రాజశేఖర్, దగ్గుపాటి వెంకటేష్, మాల ఆంజనేయులు, దగ్గుపాటి పరశురాముడు తదితరులు పాల్గొన్నారు.



# అవసరమైన వైద్య సేవలు పూర్తి స్థాయిలో అందించాలి

- జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక



**నారాయణపేట ప్రతినిధి జూన్ 24 (ప్రజా జ్యోతి)** జిల్లా ప్రజలకు అవసరమైన వైద్య సేవలను పూర్తి స్థాయిలో అందించాలని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక వైద్యాధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టర్ నారాయణ పేట మండలం లోని అప్పక్ పల్లి వద్ద గల ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి ని సందర్శించారు. మొదటగా సదరన్ క్యాంప్ ను సందర్శించి రోజు వారి సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. సదరన్ క్యాంప్ ( యూ డీ ఐ డీ ) కు సంబంధించిన నమోదు వివరాల రికార్డులను పరిశీలించి వారికి తగు సూచనలు ఇచ్చారు. యూ డీ ఐ డీ కి సంబంధించిన ఆడియాలజీ, అప్తమాలజీ, ఈ ఎన్ టీ విభాగాలతో పాటు సౌండ్ ప్రూఫ్ గదిని కలెక్టర్ పరిశీలించారు. అనంతరం ఆసుపత్రిలో అందుతున్న సేవలను ప్రత్యక్షంగా పరిశీలించి వివిధ అంశాలపై చర్చించారు. ఆనంతరం ఆసుపత్రిలోని వివిధ విభాగాల అధిపతులచే సమావేశం నిర్వహించి వారివారి విభాగాల యందు అవసరమైన మౌలిక సదుపాయాలు, పరికరాలు, మందులు మరియు ఆర్థిక పరమైన అవసరాల గురించి విభాగాధిపతులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని వివిధ విభాగాలలో సిబ్బంది కొరతను వీలైనంత త్వరగా తీరుస్తానని ఆమె తెలిపారు. శిశు మరణాల సంఖ్య తగ్గించడం కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సంకల్ప్ కార్యక్రమం ప్రజలకు చేరువ చేయవలసిన పనుల గురించి జనరల్ ఆసుపత్రి డైరెక్టర్ అండ్ ప్రిన్సిపల్, జిల్లా వైద్యాధికారికి సలహాలు సూచనలు ఇచ్చారు. నారాయణపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ద్వారా జిల్లా ప్రజలకు కావలసిన వైద్య సేవలను పూర్తి స్థాయిలో అందించాలని,అందుకోసం అధికారులు, వైద్యులు,సిబ్బంది పూర్తి స్థాయిలో పనిచేయాలని ఆమె ఆదేశించారు. రోగులకు అవసరమైన వసతులు కల్పించాలని వారికి కావలసిన వైద్య సేవలు సకాలంలో అందించాలని సూచించారు. ఆసుపత్రి లో సేవలు గురించి అడిగి తెలుసుకునీ సంతృప్తి వ్యక్తం చేస్తూ ఇంకా మెరుగు పడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి డైరెక్టర్/ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంపత్ కుమార్ సింగ్, జిల్లా వైద్యాధికారి జయచంద్ర మోహన్, డీఆర్ డీవో వెంకట్ రాములు, జిల్లా ఆస్పత్రుల సమన్వయ కర్త డాక్టర్ మల్లికార్జున్, ఆర్ ఎం వో డాక్టర్ బాలాజీ, అన్ని విభాగాల అధిపతులు ,వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# ఎస్ ఐ ఆర్ పేరుతో ఓట్లను తొలగిస్తే ఊరుకునేది లేదు – గవినొళ్ల శ్రీనివాస్ హెచ్చరిక



**నారాయణపేట ప్రతినిధి జూన్ 24 (ప్రజా జ్యోతి)** నారాయణపేట్ జిల్లా వ్యాప్తంగా ఓటరు జాబితాల ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) పేరుతో అర్హులైన ఓటర్ల ఓట్లను అన్యాయంగా తొలగించే ప్రయత్నాలు జరిగితే తెలంగాణ రక్షణ సేన తీవ్రంగా వ్యతిరేకిస్తుందని టి ఆర్ ఎస్ నారాయణపేట్ జిల్లా అధ్యక్షులు గవినొళ్ల శ్రీనివాస్ హెచ్చరించారు. జిల్లాలోని ప్రతి గ్రామంలో బూత్ స్థాయి నుండి తెలంగాణ రక్షణ సేన నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. ఓటరు జాబితాల సవరణ ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరగాలని, ప్రతి అర్హుడైన ఓటరుకు తన ఓటు హక్కు రక్షించబడేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. ఓటు హక్కు భారత రాజ్యాంగం కల్పించిన అత్యంత విలువైన ప్రజాస్వామ్య హక్కు అని, ఎలాంటి రాజకీయ లేదా పరిపాలనా ఒత్తిళ్లకు లోనుకాకుండా అధికారులు విధులు నిర్వహించాలని అన్నారు. ప్రజలకు తెలియకుండా లేదా సరైన విచారణ లేకుండా ఓట్ల తొలగింపు జరిగితే తెలంగాణ రక్షణ సేన ప్రజల తరఫున ఉద్యమిస్తుందని స్పష్టం చేశారు. నారాయణపేట్ జిల్లా ప్రజలు, తెలంగాణ రక్షణ సేన నాయకులు, కార్యకర్తలు ఓటరు జాబితాల సవరణ ప్రక్రియను నిశితంగా గమనించాలని, ఎక్కడైనా అక్రమాలు లేదా అవకతవకలు కనిపిస్తే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని గవినొళ్ల శ్రీనివాస్ కోరారు.

# రామన్ గౌడ్ భౌతికకాయానికి నివాళులర్పించిన మంత్రి జూపల్లి





**చిన్నంబావి, జూన్ 24 (ప్రజాజ్యోతి)** చిన్నంబావి మండల పరిధిలోని పెద్దమారూర్ గ్రామంలో విషాదం అలుముకుంది. గ్రామ ప్రజలతో మమేకమై, కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేసిన సీనియర్ నాయకులు మాదాసి రామన్ గౌడ్ మృతితో గ్రామం శోకసంద్రంగా మారింది. ఆయన మృతివార్త తెలుసుకున్న రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు బుధవారం పెద్దమారూర్ గ్రామానికి చేరుకుని రామన్ గౌడ్ భౌతికకాయానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా మంత్రి జూపల్లి తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. "ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామిగా నిలిచిన మంచి నాయకుడిని కోల్పోయాం. గ్రామానికి అండగా ఉన్న వ్యక్తి ఇక లేరనే విషయం బాధాకరం. కాంగ్రెస్ పార్టీకి ఆయన మరణం తీరని లోటు" అని ఆవేదన వ్యక్తం చేశారు.అనంతరం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించిన మంత్రి, వారికి ధైర్యం చెప్పారు. ఈ క్లిష్ట సమయంలో పార్టీ తరఫున అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా కల్పించారు. రామన్ గౌడ్ సేవలను గుర్తు చేసుకుంటూ పలువురు నాయకులు, గ్రామస్తులు ఆయనతో ఉన్న అనుబంధాన్ని స్మరించుకుని కన్నీటి పర్యంతమయ్యారు.మంత్రి వెంట గ్రామ సర్పంచ్ భర్త కె. లక్ష్మయ్య, ఉపసర్పంచ్ నరేష్ యాదవ్, కొప్పునూరు సర్పంచ్ వడ్డేమాన్ బిచ్చన్న, కాంగ్రెస్ పార్టీ నాయకులు హనుమంతరావు, బీచుపల్లి యాదవ్, మాజీ సర్పంచ్ కల్వకోలు ఉషన్నయ్య, చిన్నంబావి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్, మండల స్థాయి నాయకులు,కార్యకర్తలు,గ్రామస్తులు పాల్గొని మృతునికి నివాళులర్పించారు.

# నారాయణపేట జిల్లా సర్పంచ్ల సంఘం జిల్లా అధ్యక్షుడిగా కలాల్ రాజేందర్ గౌడ్ నీ ఎన్నుకున్నారు



**నారాయణ పేట ప్రతినిధి జూన్ 24 (ప్రజా జ్యోతి)** నారాయణపేట జిల్లా సర్పంచుల అధ్యక్షుడిగా మంథాన్ గోడ్ గ్రామ సర్పంచ్ కలాల్ రాజేందర్ గౌడ్ ఎన్నికయ్యారు, ఈరోజు నారాయణపేట జిల్లా కేంద్రంలోని శిలా గార్డెన్ లో జరిగిన జిల్లా సర్పంచుల సమావేశంలో సర్పంచుల జిల్లా అధ్యక్షుడిగా మంతన్ గోడ్ సర్పంచు ను ఎన్నుకున్నారు, ఈ కార్యక్రమంలో నారాయణపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సదాశివరెడ్డి , కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోట్ల రవీందర్ రెడ్డి వివిధ జిల్లా వ్యాప్తంగా వివిధ గ్రామాల సర్పంచ్లు పాల్గొన్నారు

# ఈ నెల 28న ప్రత్యేక పల్స్ పోలియో కార్యక్రమం

**-జిల్లా ఉప వైద్యాధికారి భారత్ కుమార్ రెడ్డి**



**నాగర్ కర్నూల్ : జూన్ 24 (ప్రజా జ్యోతి)**
నాగర్ కర్నూల్ జిల్లాలో ఈ నెల 28న, 0–5 సంవత్సరాల పిల్లలందరికీ ఉదయం 7 గంటలక సాయంత్రం 6 గంటల వరకు పోలియో చుక్కలు ఉచిత పంపిణీ నిర్వహించనున్నట్లు జిల్లా ఉప వైద్యదికారి డా.భరత్ కుమార్ రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.బుధవారం ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో నిర్వహిస్తున్న పీపీ యూనిట్ ను ఆయన ఆకస్మిక తనిఖీ చేసి పల్స్ పోలియో కార్యక్రమా వివరాలను సేకరించారు. పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సందర్భంగా జిల్లా కేంద్రంలో ప్రత్యేకంగా శ్రద్ధ వహించి సిబ్బంది చురుకుగా పనిచేయాలని సూచించారు. పుట్టిన బిడ్డ నుండి అయిదు సంవత్సరాల వయసు ఉన్న వారికి పిల్లల తల్లిదండ్రులు తప్పనిసరిగా రెండు పోలియో చుక్కలు వేయించాలని,జిల్లాలోని గ్రామాలలో ప్రత్యేకంగా పోలియో కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.ఇటీవల చిన్నారులకు టీకాలు వేసిన సమయంలో పోలియో చుక్కలు వేయించినప్పటికీ ప్రత్యేకంగా వేసే పోలియో చుక్కల కార్యక్రమంలో తప్పనిసరిగా రెండు చుక్కలు మరో సారి వేయించాలని ఆయన సూచించారు.జాతీయ పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని పి.పి.యూనిట్ ఆరోగ్య సిబ్బంది సాధారణ ఆసుపత్రిలో డెలివరీలో పుట్టిన ప్రతి నవజాత శిశువుకు గది నెంబర్ 22లో బి.సి.జి.టీకాను సోమవారం నుండి శనివారం వరకు ప్రతిరోజు చిన్నారులకు తప్పని సరిగా వేయాలని ఆయన సూచించారు. హెల్ప్ డెస్క్ ద్వారా గర్భిణీలకు అందుతున్న ఆరోగ్య సేవలను వివరాలు అడిగి తెలుసుకున్నారు.జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి ప్రభుత్వ సాధరణ ఆస్పత్రికి వస్తున్న గర్భిణీలకు మెరుగైన సేవలు అందించుటకు సహాయకారిగా హెల్ప్ డెస్క్ ఉండాలని ప్రసవాలు ప్రభుత్వ ఆసుపత్రిలో అయ్యేలా చూడాలని,కుటుంబ నియంత్రణ శాశ్వత మరియు తాత్కాలిక పద్ధతులను అమలుపరచుటలో జిల్లాలోని మహిళలకు సహకరించాలని ప్రతి ఆశా కార్యకర్త ఇంటింటికి వెళ్లి అర్హులైన చిన్నారులను పోలియో చుక్కల కేంద్రాలకు తరలించి చుక్కలు వేసే విధంగా మోటివేట్ చేయాలన్నారు.కార్యక్రమంలో పి.పీ. యూనిట్ వైద్యాధికారి డాక్టర్ పి.సృజన, హెల్త్ ఎడ్యుకేటర్ ఓరుగంటి శ్రీనివాసులు,నర్సింగ్ అధికారి వనిత,ఆరోగ్య పర్యవేక్షకులు,హెల్ప్ డెస్క్ ఇంచార్జ్ టి.యాదగిరి ,పి.పద్మ, మాస్టర్ ఆఫ్ సోషల్ వర్కర్ సి.జ్యోతి సిబ్బంది కిషన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.